

www.siddipetpower.com

# సిద్దిపేట పవర్

తెలుగు దినపత్రిక

SIDDIPET POWER TELUGU DAILY



సంపుటి: 01 | సంచిక: 210 | హైదరాబాద్ | శుక్రవారం | 21-11-2025 | పేజీలు: 05 | ఎడిటర్ : తుక్కోజు గణేష్ బాబు




# ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా హైదరాబాద్

**హైదరాబాద్ అభివృద్ధిలో ఏఐ వినియోగంపై చర్చలు**
**8 వారాల పైలెట్ ప్రోగ్రాం అమలుకు నిర్ణయం**
**నేత కార్మికులకు రుణమాఫీ నిధుల విడుదల**
**సీఎం రేవంత్‌రెడ్డితో అనలాగ్ ఏఐ సీఈవో భేటీ**

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ని ప్రపంచ ప్రఖ్యాత అనలాగ్ ఏఐ సంస్థ సీఈవో అలెక్స్ కిప్‌మాన్ గురువారం హైదరాబాద్‌లో కలిశారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధి, ట్రాఫిక్ మేనేజ్‌మెంట్, వరదల నివారణ వంటి కీలక అంశాలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయాన్ని ఎలా పొందాలో విస్తృతంగా చర్చించారు. సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ హైదరాబాద్‌ను భవిష్యత్తు నగరంగా తీర్చిదిద్దడమే ప్రభుత్వ లక్ష్యమని, ఈ లక్ష్య సాధనలో ఆధునిక ఏఐ టెక్నాలజీ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. ట్రాఫిక్ సిగ్నలింగ్ సిస్టమ్ అప్‌గ్రేడ్, (రియల్ టైమ్) డేటా ఆధారిత నగర నిర్వహణ, భారీ వర్షాల సమయంలో నీటి ప్రవాహాలను గుర్తించే స్మార్ట్ సిస్టంల అభివృద్ధి వంటి అంశాల్లో ఏఐ ఉపయోగంపై సూచనలు కోరారు.

**ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మూసీ రీవైవల్ ప్రాజెక్టులపై ప్రెజెంటేషన్**

సీఎం రేవంత్ కిప్‌మాన్‌కు తెలంగాణ ప్రభుత్వం చేపట్టుతున్న ప్రతిష్టాత్మక ప్రాజెక్టులు ఫ్యూచర్ సిటీ, ఏఐ సిటీ, మూసీ రివర్ ఫ్రంట్ ..మిగతా 2లో

## తెలంగాణ – నార్త్ ఈస్ట్ కనెక్ట్

**నిర్మాణానికి భూమి కేటాయింపు**
**ఆయా రాష్ట్రాలకు ప్రత్యేక భవనాలు**




## దేశమంతా సన్నబియ్యం పంపిణీ చేయండి..

**తెలంగాణ లో సక్సెస్**
**పీడీఎస్ రీ సైక్లింగ్ తగ్గుతుంది**

02

## గవర్నర్లు, రాష్ట్రపతికి గడవు విధించలేం

**గవర్నర్లకు మూడు అంశాల్లోనే నిర్ణయం**
**సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు**



03

## బీహార్‌లో కొలువుదీరిన ప్రభుత్వం

**10వ సారి ముఖ్యమంత్రిగా నితీశ్ ప్రమాణం**
**హాజరైన ప్రధాని మోడీ సహా కీలక నేతలు**
**ఏపీ సీఎం చంద్రబాబు కూడా హాజరు**
**నితీశ్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణస్వీకారం**
**సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హాలకు ఉప ముఖ్యమంత్రి పదవులు**



**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

జనతాదళ్ (యునైటెడ్) అధినేత నితీశ్ కుమార్ బీహార్ ముఖ్యమంత్రిగా పదోసారి ప్రమాణస్వీకారం చేసి రికార్డు సృష్టించారు. పాట్నాలోని గాంధీ మైదానంలో జరిగిన ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, ..మిగతా 2లో

# కేటీఆర్ ప్రాసిక్యూషన్

**ఈ కారు రేసు కేసులో కీలక పరిణామం**
**కేటీఆర్ విచారణకు ప్రభుత్వ అనుమతి**
**క్యాబినెట్ అనుమతి లేకుండా నిధుల విడుదల**
**పలువురు అధికారులను విచారించే చాన్స్**
**త్వరలో చార్జ్ షీట్ దాఖలు చేయనున్న ఏసీబీ**

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

ఫార్ములా ఈ-కార్ రేసింగ్‌లో భారీగా ప్రభుత్వ నిధుల దుర్వినియోగం జరిగిందన్న ఆరోపణల నేపథ్యంలో దర్యాప్తు జరుపుతున్న అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ)కి కీలక పురోగతి లభించింది. మాజీ మంత్రి కేటీఆర్‌పై ప్రాసిక్యూషన్ చేపట్టేందుకు అవసరమైన గవర్నర్ అనుమతిని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ మంజూరు చేశారు. ఈ అనుమతి రావడంతో కేసు దర్యాప్తు ..మిగతా 2లో




## రైతుల శ్రమకు కేంద్రం అండ



03

**నల్గొండ జిల్లాలో వ్యవసాయ విప్లవానికి ఊతం**
**ఎఫ్‌సీఐ కార్యాలయం ప్రారంభించిన కేంద్ర మంత్రి**
**దేశవ్యాప్తంగా 2.5 లక్షల టన్నుల ధాన్యం సేకరణ**
**ధాన్య ఉత్పత్తి, సేకరణలో నల్గొండది కీలక పాత్ర**
**బాయిల్డ్ రైస్ పెంచి, బకాయిలు విడుదల చేయండి**
**ప్రహ్లాద్ జోషికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి**
**బత్తాయికి కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు డిమాండ్**

## రాజమౌళిని జైల్లో పెట్టాలి..

**హనుమంతుడిపై రాజమౌళి వ్యాఖ్యల దుమారం**
**ఆయన సినిమాను బహిష్కరించండి**
**దేవుడిపై నమ్మకం లేకపోతే వారి పేరుతో సినిమాలు ఎందుకు తీస్తున్నారన్న రాజాసింగ్**
**'బాహుబలి'లో శివలింగాన్ని ఎత్తించి కోట్లు సంపాదించారని మండిపాటు**



02

## కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి.. ఇప్పుడు రేవంత్ ఏం చేస్తారో?

**గవర్నర్ ఆమోదం రావొద్దని సీఎం కోరుకున్నారు**
**ఈ కార్ రేస్ లో కేటీఆర్ పై ఎలాంటి చర్యలు తీసుకుంటారు?**
**కేసీఆర్ ఆస్తులు జప్తు చేసి జైలుకు పంపుతామన్నారు**
**ఆయన పంపకుండా కేంద్రంపై నెపం వేస్తున్నారు**
**బీజేపీ నేతల మధ్య అభిప్రాయ భేదాలు అవాస్తవం**
**నాపై ఎవరికైనా అభిప్రాయ భేదాలు ఉంటే తీసేయండి**



**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

ఈ కార్ రేస్ అంశంపై కేటీఆర్ ను విచారణ చేసేందుకు గవర్నర్ ఆమోదం రావొద్దని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరుకున్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. నాంపల్లి బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ కార్ రేస్ అంశంపై కేటీఆర్ పై సీఎం ఎలాంటి చర్యలు తీసుకుంటారోనని ప్రశ్నించారు. రాష్ట్రంలో రేవంత్, కేటీఆర్(ఆర్ కే) పాలన కొనసాగుతోందని ఆయన విమర్శించారు. మాజీ సీఎం కేసీఆర్ ఆస్తులు జప్తు చేసి జైలుకు ..మిగతా 2లో

## ప్రజాసమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపించాలి

**ప్రభుత్వ స్థలాలో నిర్మించిన పెదల ఇండ్లు రెగ్యులరైజ్ చేయాలి**
**మత్తుకు బానిసైన యువతను బయటికితెచ్చే ప్రయాత్నం చేస్తాం**
**బీజేపీ కేసులు పెట్టి బలపడాలని చూస్తోంది**
**కాంగ్రెస్ పెదలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు**
**సంక్షేమ పథకాలు అమలు చేయలేకే కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని మండిపాటు**
**జాగృతి జనం బాట కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**




03

## సౌదీ మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

**పార్టీ పరంగా సహాయసహకారాలు అందజేస్తాం**
**సౌదీ బస్సు ప్రమాదాల బాధితులకు పరామర్శ**
**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

సౌదీ లో ఇటీవల బస్సు ప్రమాదంలో మృతి చెందిన ముషీరాబాద్ యాత్రికుల కుటుంబ సభ్యులను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. మృతుల కుటుంబాలను ఓదార్చి, వారికి తన ..మిగతా 3లో



## కేటీఆర్ పై కక్షసాధింపు చర్యలు

**ప్రశ్నించే గొంతులను ప్రభుత్వం నొక్కే ప్రయత్నం**
**పూర్తి పారదర్శకతతో ఫార్ములా ఈ రేసు**
**హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ ని పెంచిన కేటీఆర్**
**అక్రమ కేసులు అప్రజాస్వామికం**
**మాజీ మంత్రి హరీష్ రావు**



**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

హైదరాబాద్ బ్రాండ్ ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నాడని బీఆర్ఎస్ ..మిగతా 2లో



# కేటీఆర్ ప్రాసిక్యూషన్

మొదటిపేజీ తరువాయి

కీలక దశలోకి ప్రవేశించింది. త్వరలోనే ఏసీబీ ఈ కేసులో ఛార్జ్‌షీట్ దాఖలు చేయడానికి సన్నద్ధమవుతోంది.

**కేసు నేపథ్యం**

హైదరాబాద్‌లో ఫార్ములా ఈ రేసును నిర్వహించేందుకు 2022లో రాష్ట్ర ప్రభుత్వం ఫార్ములా E ఆపరేషన్స్ లిమిటెడ్ (FEO), మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అండ్ అర్బన్ డెవలప్‌మెంట్ (MA&UD) శాఖ, 'ఏస్ నెక్స్ట్ జెన్' సంస్థల మధ్య త్రిపాక్షిక ఒప్పందం కుదుర్చుకుంది. గ్లోబల్ ఈవెంట్ నిర్వహణ పేరిట హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ (HMDA) ద్వారా రేస్ నిర్వాహకులకు రూ.54.88 కోట్ల చెల్లింపులు జరిగాయి. అయితే, ఈ చెల్లింపులు సరైన పరిపాలనా అనుమతులు లేకుండా, ఆర్థిక శాఖ ఆమోదం లేకుండా, ఎన్నికల మోడల్ కోడ్ అమల్లో ఉన్న సమయంలో జరిగాయని ఏసీబీ తన దర్యాప్తులో గుర్తించింది. అదే విధంగా, ప్రధాన ఒప్పందం పూర్తిగా అమల్లోకి రాకముందే భారీ రుణాలు, అడ్వాన్స్‌లు, అంతర్జాతీయ చెల్లింపులు జరిపినట్లు ఏసీబీ ఆరోపిస్తోంది. విదేశీ మారకం (FEMA) నిబంధనలను కూడా ఉల్లంఘించినట్లు ఎన్వెస్టిగేషన్‌లో బయటపడినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

**కేటీఆర్ పాత్రపై ఏసీబీ ఆరోపణలు**

ఆ సమయంలో నగరాభివృద్ధి శాఖ మంత్రిగా ఉన్న కేటీఆర్ ఈ చెల్లింపులకు ఆమోదం ఇచ్చారని, వాటిని వేగవంతం చేశారని ACB FIRలో పేర్కొన్నది. చెల్లింపుల సమయాన HMDA, MA&UD శాఖలపై కేటీఆర్‌కు ప్రత్యక్ష పర్యవేక్షణ బాధ్యత ఉందని ఏసీబీ వాదన. ఈ కేసులో మాజీ ప్రధాన కార్యదర్శి అర్విండ్ కుమార్, HMDA మాజీ చీఫ్ ఇంజినీర్ BLN రెడ్డి తదితర అధికారులు కూడా నిందితులుగా ఉన్నారు.

**విచారణకు హాజరైన కేటీఆర్**

ఈ కేసులో ఇప్పటికే పలు సార్లు కేటీఆర్ ఏసీబీ విచారణకు హాజరయ్యారు. హైకోర్టులో దర్యాప్తు నిలిపివేయాలని కేటీఆర్ వేసిన పిటిషన్‌ను కోర్టు తిరస్కరించింది. తనపై కేసు రాజకీయంగా ప్రేరేపితమని, ఒక్క రూపాయి కూడా దుర్వినియోగం జరగలేదని ఆయన పలు సందర్భాల్లో స్పష్టం చేశారు.

**గవర్నర్ అనుమతితో దర్యాప్తుకు ఊతం**

కేటీఆర్ ప్రజా ప్రతినిధి కావడంతో, ఆయనపై అధికారిక ప్రాసిక్యూషన్ ప్రారంభించడానికి గవర్నర్ అనుమతి తప్పనిసరి. ఈ నేపథ్యంలో ఏసీబీ గతంలో గవర్నర్‌కు సిఫారసులు పంపింది. కేటీఆర్ పాత్రపై తమ వద్ద సాక్ష్యాలు ఉన్నాయని ఏసీబీ లేఖలో పేర్కొంది. తాజాగా ఆ ఫైల్‌పై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సంతకం చేశారు. గవర్నర్ అనుమతి రావడంతో, ఏసీబీ ఇప్పుడు పూర్తి స్థాయి న్యాయపరమైన చర్యలకు సిద్ధమైంది. కీలక అధికారుల వాంగ్మూలాలు, బ్యాంక్ ట్రాన్సాక్షన్ వివరాలు, విదేశీ చెల్లింపుల రికార్డులు, ఒప్పందాల ప్రక్రియలో జరిగిన ఉల్లంఘనల ఆధారాలు సేకరించిన అనంతరం చార్జ్‌షీట్ ఫైల్ అయిన తర్వాత కేసు ట్రయల్ దశకు వెళ్లనుంది. ఈ కేసు ఫలితం తెలంగాణ రాజకీయాలపై, ముఖ్యంగా బీఆర్ఎస్ మరియు ప్రభుత్వంపై, గణనీయమైన ప్రభావం చూపే అవకాశం ఉందని రాజకీయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# ఫిజికల్ ఇంటెలిజెన్స్ సిటీగా హైదరాబాద్

మొదటిపేజీ తరువాయి

అభివృద్ధి ప్రాజెక్ట్ గురించి సమగ్రంగా వివరించారు. ఈ ప్రాజెక్టులు అమలు దశకు చేరుకోవడంతో, అంతర్జాతీయ స్థాయి టెక్నాలజీ భాగస్వామ్యం అవసరమని, అనలాగ్ ఏఐ సంస్థ తమ నైపుణ్యాన్ని ఉపయోగిస్తే హైదరాబాద్‌ను గ్లోబల్ టెక్ హబ్‌గా మరింతగా నిలబెట్టవచ్చని సూచించారు.

**గ్లోబల్ సమ్మిట్‌కు ఆహ్వానం**

డిసెంబర్ 8, 9 తేదీల్లో నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌కు కిప్‌మాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా ఆహ్వానించారు. అంతర్జాతీయ టెక్నాలజీ, ఇన్నోవేషన్ రంగాల్లో ప్రముఖ సంస్థలు పాల్గొనే ఈ సమ్మిట్‌లో అనలాగ్ ఏఐ సంస్థ పాల్గొనడం తెలంగాణ ప్రభుత్వానికి కీలకమని తెలిపారు.

**నేత కార్మికులకు శుభవార్త**

తెలంగాణలో నేత కార్మికులకు ప్రభుత్వం పెద్ద ఉపశమనం కల్పించింది. నేత రంగానికి సంబంధించిన రుణ మాఫీ కోసం రూ.33 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. నేత కార్మికులు ఆర్థికంగా కోలుకునేందుకు ఇది కీలక నిర్ణయంగా భావిస్తున్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర హ్యాండ్‌లూమ్, టెక్స్టైల్స్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సీఎం రేవంత్ రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. నేత కార్మికులు తెలంగాణ సాంప్రదాయం, సంస్కృతికి ప్రతీకలు అని, వారికి మద్దతు ఇవ్వడం ప్రభుత్వ ప్రాధాన్యతల్లో ఒకటని మంత్రి పేర్కొన్నారు. రుణమాఫీ నిధులు విడుదలయ్యాక వేలాది నేత కార్మిక



కుటుంబాలకు ఉపశమనం లభించనున్నదని అధికారులు తెలిపారు. అలాగే నేత పరిశ్రమను ప్రోత్సహించడానికి మరిన్ని చర్యలు చేపట్టనున్నట్లు ప్రభుత్వం సంకేతాలు ఇచ్చింది.

# దేశమంతా సన్నబియ్యం పంపిణీ చేయండి..

- **తెలంగాణ లో సక్సెస్**
- **పీడీఎస్ రీ సైక్లింగ్ తగ్గుతుంది**

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

తెలంగాణలో అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం విజయవంతమైందని.. దేశమంతటా ఈ పథకాన్ని విస్తరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషితో తన అభిప్రాయాలను పంచుకున్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా తెలంగాణలో రేషన్ షాపుల ద్వారా సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని సీఎం వివరించారు. దీంతో పీడీఎస్ బియ్యం రీ సైక్లింగ్ తగ్గిందని, బహిరంగ మార్కెట్లోనూ ధరలు స్థిరపడ్డాయని చెప్పారు. ప్రజలు తినే బియ్యాన్ని పంపిణీ చేయటంతో ఈ పథకం ఆశించిన లక్ష్యం నెరవేరిందని అన్నారు. తెలంగాణలాగే కేంద్ర ప్రభుత్వం కూడా దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ చేసే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. పూర్తిస్థాయిలో అధ్యయనం చేసి దేశవ్యాప్తంగా సన్న బియ్యం పంపిణీ అంశంపై నిర్ణయం తీసుకుంటామని కేంద్ర మంత్రి అన్నారు. గురువారం ఉదయం హైదరాబాద్‌కు వచ్చిన కేంద్ర ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో రాష్ట్ర ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి భేటీ అయ్యారు. హోటల్ తాజ్ కృష్ణాలో జరిగిన ఈ సమావేశంలో సీఎంతో పాటు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు, సీఎం ముఖ్య కార్యదర్శి శేషాద్రి, సివిల్ సప్లయిస్ ప్రిన్సిపల్ సెక్రెటరీ స్టీఫెన్ రవీంద్రతో పాటు సీనియర్ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి తగిన సహకారం అందించాలని పలు అంశాలను ప్రస్తావించారు. 2024-25 రబీ సీజన్‌కు సంబంధించి అదనంగా 10 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కోటా పెంచాలని కోరారు. పీడీఎస్ కింద సరఫరా చేసిన లెవీ రైస్‌కు సంబంధించిన రూ.1,468 కోట్ల సబ్సిడీ విడుదల చేయాలన్నారు. పీఎంజీకేఏవై అయిదో దశకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న రూ. 343.27 కోట్ల సబ్సిడీ విడుదల చేయాలని కోరారు. 2024-25 ఖరీఫ్ కస్టమ్ మిల్లింగ్ రైస్ వ్యవధి పొడిగించాలని కోరారు. ఎఫ్‌సీఐ గోదాముల్లో నిల్వ ఇబ్బందులను అధిగమించేందుకు అదనపు బాయిల్డ్ రైస్ ర్యాక్లు కేటాయించాలని, రాష్ట్రంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల గోదాముల నిల్వ సామర్థ్యం పెంచుకునేందుకు కేంద్రం సాయం అందించాలని కోరారు. 2025-26 ఖరీఫ్ లో అత్యధికంగా 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వచ్చిందని, ధాన్యం కొనుగోలు లక్ష్యాన్ని 80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తులన్నీ సానుకూలంగా పరిశీలిస్తామని కేంద్ర మంత్రి హామీ ఇచ్చారు. దేశవ్యాప్తంగా బాయిల్డ్ రైస్ అవసరం తగ్గిందని, అందువల్ల మిల్లింగ్‌కు అనువైన ముడి బియ్యం రకాల సాగును ప్రోత్సహించాలని సూచించారు. రాష్ట్రంలో మిగులు ధాన్యం నిల్వలను సమర్థంగా నిర్వహించేందుకు ఎగుమతి అవకాశాలను పరిశీలించాలని సలహా ఇచ్చారు. ధాన్యం సేకరణ లక్ష్యాన్ని80 లక్షల మెట్రిక్ టన్నులకు పెంచాలని, బాయిల్డ్ రైస్ అదనపు కోటాను కేటాయించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశారు. రా రైస్ కు అనువైన రకాల వరి సాగును ప్రోత్సహించేందుకు రైతులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు చేపడతామన్నారు.



# తెలంగాణ –నార్త్ ఈస్ట్ కనెక్ట్

- **నిర్మాణానికి భూమి కేటాయింపు**
- **ఆయా రాష్ట్రాలకు ప్రత్యేక భవనాలు**

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

తెలంగాణ-నార్త్ ఈస్ట్ కనెక్ట్ కు బీజం పడిందని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్ హైటెక్స్ లో తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్ టెక్నో కల్చరల్ ఫెస్టివల్ కార్యక్రమానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ..తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తోన్న భారత్ ఫ్యూచర్ సిటీలో, భారతదేశపు మొట్టమొదటి 'నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రాన్ని' నిర్మించడానికి భూమి కేటాయిస్తామన్నారు. ఈ అనుబంధ కేంద్రంలో ప్రతి ఈశాన్య రాష్ట్రం వారి సొంత భవనాలను నిర్మించుకోవడానికి వెసులుబాటు కల్పిస్తామన్నారు. అస్సాం, అరుణాచల్ ప్రదేశ్ , మణిపూర్, మేఘాలయ, మిజోరం, నాగాలాండ్, సిక్కిం, త్రిపుర రాష్ట్రాలు..వారి ప్రత్యేక భవనంతో పాటు హాస్టల్ సౌకర్యం, ఆహారం, చేతివృత్తులు, సంస్కృతులు, కళల ప్రదర్శనకు వేదికలు ఏర్పాటు చేసుకోవచ్చన్నారు. తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్ కు కల్చరల్ కనెక్ట్ ఈవేదికగా మొదలైందన్నారు. తెలంగాణ సోదరుడు త్రిపుర గవర్నర్ గా పనిచేస్తున్నారని, త్రిపుర సోదరుడు తెలంగాణ గవర్నర్ గా పని చేయడం విశేషంగా ఉన్నదన్నారు. త్రిపుర, తెలంగాణ మధ్య ఈ అనుబంధం ఇలాగే కొనసాగాలన్నారు. ఇండియాలో తొలి నార్త్ ఈస్ట్ అనుబంధ కేంద్రాన్ని తెలంగాణ ఫ్యూచర్ సిటీలో ఏర్పాటు చేసే ప్రణాళికలను విజయవంతంగా ముందుకు తీసుకు వెళ్తామన్నారు. తెలంగాణ అభివృద్ధి లక్ష్యాలను, తెలంగాణ రైజింగ్ విజన్ 2047 ఉద్దేశాలను దేశంలోని ప్రతి ప్రాంతానికి, ప్రపంచ నలుమూలలకు తీసుకువెళ్లడానికి సహకారం ఉండాలన్నారు.

తెలంగాణ నార్త్ ఈస్ట్ కనెక్ట్ ఉత్సవం రెండు రాష్ట్రాలకు మధ్య ఉన్న ఐక్యతా స్ఫూర్తిని చాటుతుందన్నారు. మన దేశ ఈశాన్య ప్రాంతం ఎంతో అందమైనదని, విభిన్నమైనదని వివరించారు.



పర్యావరణ సంపదతో పాటు సాంస్కృతిక చైతన్యం కలిగిన ప్రాంతం ఈశాన్య ప్రాంతమని వివరించారు. ఇప్పటికీ ఈశాన్య రాష్ట్రాల్లో వెలుగులోకి రాని అంశాలు చాలా ఉన్నాయని, ప్రాంతీయ గుర్తింపు విషయంలో ఈశాన్య రాష్ట్రాల పౌరుల బాధను తెలుగు ప్రజలు క్షుణ్ణంగా అర్థం చేసుకోవచ్చన్నారు. 1970 లు ,80లలో ఉత్తరాది రాష్ట్రాలు ..మన దక్షిణాది వాళ్లందరినీ 'మద్రాసీలు' అని పిలిచే వారని గుర్తు చేశారు. తెలుగువారికంటూ ప్రత్యేక గుర్తింపు ఉండేది కాదన్నారు. తెలుగు, తమిళం, కన్నడ, మలయాళ భాషలు, సంస్కృతుల మధ్య తేడాను వివరించడం దక్షిణాది వారికి కష్టంగా ఉండేదన్నారు. అయినా ఎకానమీ పరంగా, సాంస్కృతిక పరంగా, ఇతర రంగాల్లో దేశాభివృద్ధిలో దక్షిణాది రాష్ట్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయన్నారు. ఈశాన్య రాష్ట్రాల ప్రజలను, వారి సంస్కృతిని మరింత బాగా అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉన్నదన్నారు. వారితో కనెక్టివిటీ పెంచుకోవాలన్నారు. అప్పుడే ఈశాన్య రాష్ట్రాలు కూడా అన్ని రంగాలలో మన దేశానికి మరింతగా తోడ్పాటు అందించే రాష్ట్రాలుగా మారతాయన్నారు. హైదరాబాద్‌లో ఈశాన్య రాష్ట్రాల నుంచి వచ్చిన వారు పెద్ద సంఖ్యలో ఉన్నట్లు వివరించారు. సాఫ్ట్‌వేర్, ఫార్మా, హెల్త్‌కేర్, టూరిజం, హాస్పిటాలిటీ, స్టార్టప్‌లు, క్రీడలు వంటి అన్ని రంగాలలో వారు సక్సెస్ అయ్యారన్నారు. తెలంగాణ సమాజంతో కలిసిపోయి, ఇక్కడ అభివృద్ధికి తోడ్పడుతున్న వారందరికీ ప్రభుత్వం తరపున ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ దంపతులు, మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, డీజీపీ శివధర్ రెడ్డి, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేటీఆర్ పై కక్షసాధింపు చర్యలు

మొదటిపేజీ తరువాయి

ఎమ్మెల్యే హరీశ్ రావు విమర్శించారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికమన్నారు. కేటీఆర్‌పై రాజకీయ కక్ష సాధింపు చర్యలకు ఇది పరాకాష్ఠ అని ఆయన విమర్శించారు. ఈ ప్రభుత్వం ప్రశ్నించే వారి గొంతులు నొక్కే ప్రయత్నం చేస్తోందన్నారు. ప్రతిపక్ష నేతలను వేధించడమే సీఎం రేవంత్‌రెడ్డి పనిగా పెట్టుకున్నారు. హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్ పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు పెట్టారు. స్థానిక ఎన్నికల్లో రాజకీయ లబ్ది కోసం చిల్లర డ్రామాలు చేస్తున్నారు. కేటీఆర్‌కు అండగా ఉంటాం అని హరీశ్‌రావు అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారని చెప్పారు. అక్రమ కేసులతో కేటీఆర్, బీఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరని ఎక్స్ వేదికగా వెల్లడిరచారు. 'మా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై రాజకీయకక్ష సాధింపు చర్యలకు పరాకాష్ట ఇది. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉండి ప్రశ్నించే గొంతులను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నొక్కే ప్రయత్నం చేస్తుండటం దుర్మార్గం. పూర్తి పారదర్శకతతో నిర్వహించిన ఫార్ములా ఈ 'రేస్‌లో రెండేళ్లుగా కోడిగుడ్డుపై ఈకలు పీకుతున్నది కాంగ్రెస్ సర్కార్. హైదరాబాద్ బ్రాండ్



ఇమేజీని పెంచిన కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయించి ఇబ్బంది పెట్టడమే లక్ష్యంగా పెట్టుకున్నడు రేవంత్ రెడ్డి. ప్రభుత్వ వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగడుతున్న కేటీఆర్ పై అక్రమ కేసులు బనాయించి రాక్షసానందం పొందటం అప్రజాస్వామికం.స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ లబ్ది పొందేందుకు చేస్తున్న చిల్లర డ్రామాలను ప్రజలు గమనిస్తున్నారు. అక్రమ కేసులతో కేటీఆర్, బిఆర్ఎస్ నాయకుల మనోస్థైర్యాన్ని దెబ్బతీయలేరు. కేటీఆర్‌కు బీఆర్ఎస్ పార్టీ పూర్తి అండగా ఉంటుంది. రేవంత్ రెడ్డి దుర్మార్గ వైఖరిని న్యాయపరంగా ఎదుర్కొంటాం.' అని ట్వీట్ చేశారు.

# కేటీఆర్ ప్రాసిక్యూషన్‌కు అనుమతి.. ఇప్పుడు రేవంత్ ఏం చేస్తారో?

మొదటిపేజీ తరువాయి

పంపుతామని రేవంత్ రెడ్డి అన్నారని, మరి జైలుకు పంపకుండా..కేంద్రంపై ఎందుకు నెపం వేస్తున్నారని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి, కేసీఆర్‌కు మధ్య లోపాయికారి ఒప్పందం కుదిరిందని పేర్కొన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్స్ ఎందుకు ఇవ్వలేకపోతున్నారని నిలదీశారు. 42 శాతం రిజర్వేషన్స్ ఇచ్చాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బిజేపీ నేతల మధ్య అభిప్రాయ భేదాలు అవాస్తవమని, తనపై ఎవరికైనా అభిప్రాయ భేదాలు ఉంటే తీసేయాలని బండి సూచించారు. పార్టీ బలోపేతం కోసం పనిచేయాలి పిలుపునిచ్చారు. నగరాలు, పట్టణాల్లో ఏసీ రూమ్ లో ఉండి మాట్లాడే అర్బన్ నక్సలైట్లు.. అడవిలో ఉండే నక్సలైట్లను లొంగిపోవాలని ఏనాడైనా చెప్పారా అని ప్రశ్నించారు. అర్బన్ నక్సలైట్స్ జల్సాలు చేస్తూ నామినేటెడ్ పదవులు పొందుతున్నారన్నారు. భారత్ ను 2047లో అగ్ర రాజ్యంగా మార్చడమే తమ లక్ష్యమని బండి వివరించారు. మరి నక్సలైట్ల లక్ష్యం ఏంటో చెప్పాలని ప్రశ్నించారు. తుపాకీలు పట్టి కాల్చి చంపడమే లక్ష్యమా? అని నిలదీశారు. వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలుచేస్తామని రేవంత్ రెడ్డి హామీ ఇచ్చారని, ఇప్పుడు ఆ హామీలు విస్మరించిన సర్కార్ తో ఎందుకు భాగస్వాములు అయ్యారని సంజయ్ ప్రశ్నించారు. నామినేటెడ్ పోస్టులు ఎందుకు తీసుకున్నారని, కమిటీల్లో ఎందుకు ఉన్నారన్నారు. పాటలు, మాటల ద్వారా మైనర్లను రెచ్చగొట్టి అడవుల్లోకి పంపిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అర్బన్ నక్సలైట్లు 10 రోజులు అడవుల్లో తిరిగితే వారికి తెలుసొస్తుందన్నారు. నైతికత ఉంటే ప్రభుత్వంలో భాగస్వాములై పదవులు పొందిన వారు వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. పెద్ద పెద్ద మావోయిస్టులు లొంగిపోతున్నారని, లొంగిపోండి అని చెప్పని మూర్ఖపు సిద్ధాంతం దేనికని నిలదీశారు. అడవుల్లో ఉన్న వాళ్లు ప్రధాని మోడీ అభివృద్ధిని గుర్తించారని, కానీ అర్బన్ నక్సలైట్స్ గుర్తించడం లేదని ఎద్దేవా చేశారు. ఇదిలా ఉండగా రాజమౌళి వ్యాఖ్యలపై బండి సంజయ్ స్పందించారు. ఎవరి ఆలోచనలు వారివని, అయితే దర్శకుడు రాజమౌళి దేవుడిని నమ్మేలా ఆ దేవుడు కరుణ కటాక్షాలు కలిగించాలని బండి కోరారు.

టెన్త్ పేపర్ లీక్ కేసును రద్దు చేస్తూ హైకోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తున్నట్లు బండి ఒక ప్రకటనలో తెలిపారు. చేయని తప్పునకు తనను జైలుకు పంపారన్నారు. మానవత్వం మరిచి తనపై, బీజేపీ కార్యకర్తలపట్ల క్రూరంగా వ్యవహరించారన్నారు. అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము వరకు తనను రోడ్లపై తిప్పుతూ ఏదో చేద్దామనుకున్నారని, కార్యకర్తల ధాటికి తట్టుకోలేక జైలుకు పంపారని గుర్తుచేశారు. టెన్త్ హిందీ పేపర్ ను ఎవరైనా లీక్ చేస్తారా? అంటూ జనం నవ్వుకున్నారని పేర్కొన్నారు. ఇన్ని కేసుల విషయంలో కోర్టుల చుట్టూ తిరగలేక ఇబ్బంది పడుతున్నానని, అయినా భరిస్తున్నానంటూ



తెలిపారు. కేసీఆర్ ప్రభుత్వ మెడలు వంచిన పార్టీ బీజేపీ అనే తృప్తి తనకు మిగిలిందన్నారు. ఈ పాపం ఊరికే పోదని, కక్ష సాధింపు చర్యలకు ఫలితం ఉంటుందని సంజయ్ హెచ్చరించారు. తనపై మోపిన కేసులన్నీ అక్రమమైనవని ఈ తీర్పు ద్వారా నిరూపితమైందన్నారు. ప్రజాకంటకంగా వ్యవహరిస్తూ అక్రమ కేసులు వేస్తున్నారన్నారు. తనకు కేంద్ర మంత్రి అమిత్ షా, పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా అండగా నిలిచారన్నారు. తనకు అండగా ఉన్న బీజేపీ జాతీయ నాయకత్వానికి, కార్యకర్తలకు ధన్యవాదాలు తెలిపారు.

# బీహార్‌లో కొలువుదీరిన ప్రభుత్వం

మొదటిపేజీ తరువాయి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సహా పలువురు జాతీయ నేతలు హాజరయ్యారు. నితీశ్ కుమార్‌తో పాటు 27 మంది మంత్రులుగా ప్రమాణం చేశారు. బీజేపీ నేతలు సామ్రాట్ చౌదరి, విజయ్ కుమార్ సిన్హా ఉప ముఖ్యమంత్రులుగా బాధ్యతలు చేపట్టారు. ఇటీవల జరిగిన బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘన విజయం సాధించిన సంగతి తెలిసిందే. మొత్తం 243 అసెంబ్లీ స్థానాలకు గాను, నితీశ్ కుమార్ నేతృత్వంలోని కూటమి ఏకంగా 202 సీట్లను కైవసం చేసుకుంది. ఇందులో బీజేపీ 89 స్థానాల్లో గెలుపొందగా, జేడీయూ 85 స్థానాల్లో విజయం సాధించింది. ఈ నేపథ్యంలో ఏర్పాటైన కొత్త మంత్రివర్గంలో బీజేపీ నుంచి 14 మందికి, జేడీయూ నుంచి 9 మందికి చోటు దక్కింది. నితీశ్ కుమార్ దాదాపు 19 ఏళ్లుగా బీహార్ ముఖ్యమంత్రి పదవిలో కొనసాగుతున్నారు. 2000 సంవత్సరంలో తొలిసారి సీఎంగా ఏడు రోజులు మాత్రమే పనిచేసిన ఆయన, ఇప్పుడు పదోసారి ముఖ్యమంత్రి పగ్గాలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా నితీశ్‌కు శుభాకాంక్షలు తెలిపారు. "రాజకీయాల్లో ఎంతో అనుభవం, రాష్ట్రానికి మంచి పాలన అందించిన అద్భుతమైన రికార్డు నితీశ్‌కు ఉంది" అని ఆయన కొనియాడారు.

# రాజమౌళిని జైల్లో పెట్టాలి.. ఆయన సినిమాను బహిష్కరించండి

- **హనుమంతుడిపై రాజమౌళి వ్యాఖ్యల దుమారం**
- **ఆయన సినిమాను బహిష్కరించండి**
- **దేవుడిపై నమ్మకం లేకపోతే వారి పేరుతో సినిమాలు ఎందుకు తీస్తున్నారన్న రాజాసింగ్**
- **'బాహుబలి'లో శివలింగాన్ని ఎత్తించి కోట్లు సంపాదించారని మండిపాటు**

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

ప్రముఖ సినీ దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి హనుమంతుడిపై చేసిన వ్యాఖ్యలు తీవ్ర వివాదానికి దారితీశాయి. ఓ కార్యక్రమంలో ఆయన చేసిన ఈ వ్యాఖ్యలపై గోషామహల్ బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్ తీవ్రస్థాయిలో మండిపడ్డారు. హిందువుల మనోభావాలను దెబ్బతీసిన రాజమౌళిని జైల్లో పెట్టాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ మేరకు రాజాసింగ్ ఓ వీడియోను విడుదల చేశారు. దేవుళ్లపై నమ్మకం లేనప్పుడు, వారి పేరుతో సినిమాలు తీసి కోట్లాది రూపాయలు ఎందుకు సంపాదిస్తున్నారని రాజమౌళిని నిలదీశారు. ప్రభాస్‌తో 'బాహుబలి' సినిమా తీసి, అందులో శివలింగాన్ని ఎత్తించి కోట్లు సంపాదించుకుని, ఇప్పుడు హిందూ దేవుళ్లపై నమ్మకం లేదని మాట్లాడటం సరికాదన్నారు. హిందూ ధర్మంపై అభిమానం లేని రాజమౌళి సినిమాలను హిందువులంతా బహిష్కరించాలని పిలుపునిచ్చారు. 'వారణాసి' సినిమా ప్రచారం కోసమే ఇలా మాట్లాడారా, లేక నిజంగానే నాస్తికులా అనే విషయంపై రాజమౌళి స్పష్టత ఇవ్వాలని రాజాసింగ్ డిమాండ్ చేశారు. రాజమౌళి హిందూ దేవుళ్లను కించపరచడం ఇది మొదటిసారి కాదని, గతంలో రాముడు, కృష్ణుడిపై కూడా ఇలాంటి వ్యాఖ్యలే చేశారని గుర్తుచేశారు. ఇలాంటి దర్శకుడిపై హిందువులు ఫిర్యాదులు చేయాలని ఆయన కోరారు.



# గవర్నర్లు, రాష్ట్రపతికి గడవు విధించలేం

- **గవర్నర్లకు మూడు అంశాల్లోనే నిర్ణయం**
- **సుప్రీంకోర్టు ధర్మాసనం కీలక తీర్పు**

**సిద్దిపేట పవర్,న్యూఢిల్లీ :**

గవర్నర్,రాష్ట్రపతి అధికారాలపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. పెండిరగ్ బిల్లుల ఆమోదానికి సంబంధించిన అంశంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించటం తగదని స్పష్టం చేసింది. కారణం చెప్పకుండా గవర్నర్‌లు బిల్లులను వెనక్కి పంపలేరని తెలిపింది. బిల్లును నిరవధికంగా నిలిపివేసే అధికారం గవర్నర్‌కు లేదని కూడా తేల్చి చెప్పింది. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి పంపితేనే రాష్ట్రపతి చర్యలు తీసుకోగలరని చెప్పింది. ఆర్టికల్ 200 ప్రకారం గవర్నర్‌కు విచక్షణాధికారం ఉందని వెల్లడిరచింది. తన ముందుకు వచ్చిన బిల్లులను గవర్నర్ రాష్ట్రపతికి పంపడం, అభిప్రాయాలతో తిరిగి పంపడం, బిల్లును పరిశీలించి సూచనలు ఇవ్వడం వంటివి మాత్రమే చేస్తారని తెలిపింది. రాష్ట్ర పరిపాలనలో తుది అధికారం ఎన్నుకోబడిన మంత్రివర్గానిదేనని స్పష్టం చేసింది. ఒక రాష్ట్రంలో రెండు ఎగ్జిక్యూటివ్ పవర్స్ ఉండవని, ప్రభుత్వం ఒక్కటే ప్రధాన నిర్ణయాధికారి అని తేల్చి చెప్పింది. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించి పంపిన బిల్లులకు ఆమోదం తెలిపే విషయంలో న్యాయస్థానం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించటంపై ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ పంపిన ప్రెసిడెన్షియల్ రిఫరెన్స్‌పై స్పందిస్తూ సుప్రీం కోర్టు ఈ తీర్పును వెలువరించింది. రాష్టర శాసనసభలు ఆమోదించి పంపించిన బిల్లులకు సమ్మతి తెలిపే అంశంలో సుప్రీంకోర్టు గురువారం కీలక తీర్పు వెలువరించింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు న్యాయస్థానం గడువు విధించడంపై దేశ ప్రథమ పౌరురాలు ద్రౌపదీ ముర్మ సంధించిన ప్రశ్నలపై అత్యున్నత న్యాయస్థానం సమాధానమిచ్చింది. పెండిరగ్ బిల్లుల ఆమోదం కోసం రాష్ట్రపతి, గవర్నర్లకు గడువును విధించడం తగదని సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం స్పష్టంచేసింది. అయితే, కారణం చెప్పకుండా గవర్నర్లు బిల్లులను వెనక్కి పంపలేరని వెల్లడిరచింది. ఈ మేరకు దీనిపై గతంలో ద్విసభ్య ధర్మాసనం ఇచ్చిన తీర్పును సీజేఐ ధర్మాసనం పక్కనబెట్టింది. గవర్నర్‌కు రాజ్యాంగపరంగా మూడు ఆప్షన్లు ఉంటాయి. బిల్లులకు సమ్మతి తెలియజేయడం, కారణం చెప్పి బిల్లును రిజర్వ్‌లో పెట్టడం లేదా రాష్ట్రపతికి పంపడం, బిల్లును తిరస్కరించి అసెంబ్లీకి పంపడం. ఈ మూడు ఆప్షన్లు ఎంచుకోవడంలో గవర్నర్ విచక్షణాధికారాన్ని ఉపయోగిస్తారు. ఇందుకు న్యాయస్థానాలు గడువు విధించడం సబబు కాదని అభిప్రాయపడ్డారు. గవర్నర్ల విధుల నిర్వహణ వ్యవహారాల్లో కోర్టులు జోక్యం చేసుకోవు. కానీ, కారణం లేకుండా దీర్ఘకాలంగా బిల్లులను పెండిరగ్‌లో ఉంచిన సందర్భాల్లో కోర్టులు పరిమిత విచక్షణతో వ్యవహరించొచ్చు. రాష్ట్రపతి విషయంలోనూ ఇదే వర్తిస్తుంది. నిరవధిక ఆలస్యం కొనసాగుతున్న సందర్భాల్లో అది న్యాయసమీక్ష పరిధిలోకి వస్తుందని తెలిపారు. గవర్నర్ బిల్లును రాష్ట్రపతికి రిజర్వ్ చేసిన ప్రతిసారీ ఆర్టికల్ 143 కింద రాష్ట్రపతి సుప్రీంను సంప్రదించాల్సిన అవసరం లేదు. ఆర్టికల్ 200 కింద గవర్నర్లకు విచక్షణాధికారం ఉంటుంది. అయితే, దాన్ని అపరిమితంగా వినియోగించలేరు.శాసనసభలు ఒకటికి రెండుసార్లు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు ఆమోదం తెలపకుండా కాలయాపన చేయడం, రాష్ట్రపతి పరిశీలనలో ఉన్నవీ తీవ్ర జాప్యానికి గురికావడంపై ఈ ఏడాది ఏప్రిల్‌లో సుప్రీం కోర్టు సంచలన నిర్ణయం తీసుకున్న సంగతి తెలిసిందే. గతంలో ఎన్నడూ లేనివిధంగా ఈ అంశంలో గవర్నర్‌తో పాటు రాష్ట్రపతికీ గడువు విధించింది. గరిష్ఠంగా మూడు నెలల్లోగా ఆ బిల్లులను ఆమోదించడమో, తిప్పి పంపించడమో చేయాలని జస్టిస్ జె.బి.పార్దీవాలా, జస్టిస్ ఆర్.మహాదేవన్ ధర్మాసనం నిర్దేశిరచింది. దీంతో రాజ్యాంగ అధికరణం 143(1) ప్రకారం తనకున్న అధికారాన్ని వినియోగిస్తూ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్మ మే నెలలో పలు ప్రశ్నలతో సీజేఐకి లేఖ రాశారు. రాష్ట్రపతి విచక్షణ అధికారాల పరిధిలోకి వచ్చే రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలిపే అంశంలో న్యాయస్థానం గడువు విధించడం ఎంతవరకు న్యాయ సమ్మతమో తెలపాలంటూ సుప్రీంకోర్టు అభిప్రాయాన్ని కోరారు. దీనిపై సీజేఐ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ఏర్పాటైంది. పది రోజుల పాటు అన్ని పక్షాల వాదనలను ఆలకించిన ధర్మాసనం సెప్టెంబరు 11న తీర్పు రిజర్వు చేసింది. ఈ విషయంలో రాష్ట్రపతి, గవర్నర్లకు గడువు విధించలేమంటూ తాజాగా తీర్పు వెలువరించింది.

# మోడరన్ స్కూల్‌లో మెగా హెల్త్ క్యాంప్ హోరెత్తింది

**కాప్రా,నవంబర్ 20(సిద్దిపేట పవర్):**

మల్లాపూర్ డివిజన్ సూర్యనగర్ కాలనీలోని మోడరన్ హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్-మీరపేట్ ఆధ్వర్యంలో ఉచిత మెగా మెడికల్ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. మోడరన్ స్కూల్ ఫౌండర్ జి. ముత్యంరెడ్డి జన్మదినాన్ని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన ఈ శిబిరంలో అపోలో, సియోన్ కాన్సర్ క్లినిక్, ఎం.ఎస్.రెడ్డి లయన్ కంటి ఆసుపత్రి వైద్య బృందాలు సేవలు అందించాయి. ముత్యంరెడ్డి ఈ సందర్భంగా సూర్యనగర్ కాలనీ అభివృద్ధికి రూ.40,000 చెక్కును అందజేశారు. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్ దేవేందర్ రెడ్డి, లయన్స్ క్లబ్ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఇన్నా రెడ్డి, రెండవ గవర్నర్ కళ్లెం కృష్ణారెడ్డి, మూడవ గవర్నర్ మండల సురేష్ కలిసి తదితరులు శిబిరాన్ని ప్రారంభించారు. సాధారణ ఆరోగ్య పరీక్షలు, కంటి-దంత పరీక్షలు, ల్యాబ్ టెస్టులు,ఉచిత మందుల పంపిణీ నిర్వహించగా స్థానికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.




# రైతుల శ్రమకు కేంద్రం అండ

- **నల్గొండ జిల్లాలో వ్యవసాయ విప్లవానికి ఊతం**
- **ఎఫ్‌సీఐ కార్యాలయం ప్రారంభించిన కేంద్ర మంత్రి**
- **దేశవ్యాప్తంగా 2.5 లక్షల టన్నుల ధాన్యం సేకరణ**
- **ధాన్య ఉత్పత్తి, సేకరణలో నల్గొండది కీలక పాత్ర**
- **బాయిల్డ్ రైస్ పెంచి, బకాయిలు విడుదల చేయండి**
- **ప్రహ్లాద్ జోషికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విజ్ఞప్తి**
- **బత్తాయికి కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటుకు డిమాండ్**

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

కేంద్ర ఆహార, పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషి గురువారం నల్గొండ జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఎఫ్‌సీఐ డివిజనల్ కార్యాలయం, బఫర్ నిల్వ సముదాయాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహా ఎంపీ రఘువీర్ రెడ్డి, ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో జోషి మాట్లాడుతూ, ఆహార భద్రతలో భాగంగా దేశవ్యాప్తంగా 2.50 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరిస్తున్నామని, దేశంలో 9.15 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వ ఉందని చెప్పారు. తెలంగాణకు ప్రతినెల 1.11 లక్షల మెట్రిక్ టన్నుల ఆహార ధాన్యాన్ని కేటాయిస్తున్నామని, ఇందులో లక్ష మెట్రిక్ టన్నుల బియ్యం కాగా, 3,370 గోధుమలు అందిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోనే నల్గొండ జిల్లా ధాన్య ఉత్పత్తి, సేకరణలో ముందు వరసలో ఉందన్నారు. 201415 నుంచి తెలంగాణ నుంచి ధాన్యం సేకరణను 600 శాతానికి పెంచినట్లు చెప్పారు. ప్రస్తుతం ఉన్న గోడౌన్ 62 వేల మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగి ఉందని, ప్రభుత్వం భూమి కేటాయిస్తే మరో గోడౌన్ నిర్మించేందుకు కేంద్రం సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. తెలంగాణకు రావాల్సిన రూ.343 కోట్ల సబ్సిడీతో పాటు 1400 కోట్ల సీఎంఆర్ బకాయిలు విడుదల చేస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

**సీఎంఆర్ గడువు పొడిగించండి**

రాష్ట్రానికి సంబంధించిన పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని కేంద్ర మంత్రిని పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కోరారు. ముఖ్యంగా, 202425 ఏడాదికి సంబంధించి బాయిల్డ్ రైస్ లక్ష్యాన్ని పెంచాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత ఖరీఫ్‌లో 1.50 కోట్ల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కాగా, రాష్ట్ర ప్రభుత్వం 8,800 కేంద్రాలను ఏర్పాటు చేసి 80 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరించిందని, ఇందుకోసం సుమారు 29 వేల కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. 202425 ఖరీఫ్ సీఎంఆర్ డెలివరీ గడువును 60 రోజులకు, యాసంగి సీజన్ సీఎంఆర్ గడువును 120 రోజులకు పెంచాలని అభ్యర్థించారు. బియ్యం రవాణా వేగంగా జరిగేందుకు రాష్ట్రానికి అదనపు ర్యాక్‌ల సదుపాయం కల్పించాలని, 202526 సంబంధించిన ధాన్యం సేకరణ టార్గెట్‌ను 80 లక్షల మెట్రిక్ టన్నుల నుంచి పెంచాలని కోరారు.



**బత్తాయి రైతులకు నిల్వ భద్రత కావాలి**

నల్గొండ జిల్లాలో అత్యధికంగా 17,500 హెక్టార్లలో 4.5 లక్షల టన్నుల బత్తాయి సాగవుతున్నప్పటికీ, దీనికి ఇంకా జాతీయ స్థాయిలో గుర్తింపు, తగిన నిల్వ మౌలిక సదుపాయాలు లేవు. ఈ నేపథ్యంలో, నల్గొండ బత్తాయికి 'ఒక జిల్లా ఒక ఉత్పత్తి' హోదా కల్పించాలని విజ్ఞప్తి చేశారు. దీంతో పాటు 2,500 మెట్రిక్ టన్నుల కోల్డ్‌స్టోరేజ్ సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.రైతుల సంక్షేమాన్ని పెంపొందించడానికి, అధునాతన సైలోలు, డ్రైయర్‌లతో కూడిన ఆధునిక వరి ధాన్యం గిడ్డంగి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయడం జరిగింది. ఈ చర్యలన్నీ నల్గొండ జిల్లాలోని రైతుల సంక్షేమాన్ని మరింత బలోపేతం చేస్తాయని,వ్యవసాయ ఉద్యానవన రంగాల అభివృద్ధిని

## ఏఐవైఎఫ్ నిర్మాణ విస్తృత స్థాయి సమావేశాన్ని

# జయప్రదం చేయండి

**మక్తల్,నవంబర్ 20(సిద్దిపేట పవర్):**

ఈనెల 29వ తేదీన ఆత్మకూరు పట్టణంలో జరగనున్న ఏఐవైఎఫ్ జిల్లా స్థాయి నిర్మాణ విస్తృత స్థాయి సమావేశం విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి ఎండి. కుతుబ్ పిలుపునిచ్చారు. గురువారం అమరచింత హైస్కూల్ గ్రౌండ్ ఆవరణలో సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆయన విడుదల చేశారు. జిల్లాలోని యువకులు, యువతులు, మహిళలు, అభ్యుదయ భావాలు గల వారందరూ పెద్దఎత్తున పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యదర్శి కె.విజయ రాములు, మండల కార్యదర్శి ఏ.అబ్రహం, పట్టణ కార్యదర్శి రవీందర్, భాస్కర్,శ్యాంసుందర్,సౌలు,శేఖర్ తదితరులు పాల్గొన్నారు.





# సౌధీ మృతుల కుటుంబాలకు అండగా ఉంటాం

**మొదటిపేజీ తరువాయి**

ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని ప్రార్థించారు. బీఆర్ఎస్ తరపున మృతుల కుటుంబాలకు అండగా ఉంటామన్నారు. అవసరమైన సహాయ, సహకారాలు అందించడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు. మృతదేహాల తరలింపు లేదా ఇతర ఏమైనా కార్యక్రమాలు చేయాల్సి ఉంటే, వాటిని పూర్తి చేయడానికి విదేశాంగ అధికారులతో స్వయంగా మాట్లాడతామని తెలిపారు. మరణించిన వారి పట్ల పూర్తి శ్రద్ధ వహించడానికి ఇప్పటికే బీఆర్ఎస్ పార్టీ పక్షాన తమ బృందం సౌదీ అరేబియాకు వెళ్లారని అన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు ముఠా గోపాల్, తలసాని శ్రీనివాస్ యాదవ్, పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి మహమ్మద్ అలీ, ముఠా జై సింహ, మాజీ బీసీ కమిషన్ సభ్యుడు కిషోర్ గౌడ్ పాల్గొన్నారు.

# ప్రజాసమస్యలకు ప్రభుత్వం పరిష్కారం చూపించాలి

- **ప్రభుత్వ స్థలాలో నిర్మించిన పేదల ఇండ్లు రెగ్యులరైజ్ చేయాలి**
- **మత్తుకు బానిసైన యువతను బయటికితెచ్చే ప్రయాత్నం చేస్తాం**
- **బీజేపీ కేసులు పెట్టి బలపడాలని చూస్తోంది**
- **కాంగ్రెస్ పేదలకు ఇచ్చిన హామీలు అమలు చేయడం లేదు**
- **సంక్షేమ పథకాలు అమలు చేయలేకే కాంగ్రెస్ కుట్రలు చేస్తోందని మండిపాటు**
- **జాగృతి జనం బాట కార్యక్రమంలో వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**

**సిద్దిపేట పవర్, హైదరాబాద్ :**

గ్రేటర్ హైదరాబాద్ నగరంలో పెద్ద పెద్ద విల్లాలున్న సంపన్నుల కంటే పేదలు అత్యధిక ఉన్నారని తెలంగాణ జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తెలిపారు. ఈ పేదలు నివాసించే బస్తీలల్లో చిద్రమైన రోడ్లు, సకాలం నీరు రాక ఇబ్బందులు పడుతున్నారని స్థానికులు వివరిస్తున్నట్లు కవిత అన్నారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో భాగంగా శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్, చేవెళ్ల, షాద్‌నగర్ నియోజకవర్గాల్లోని పలు ప్రాంతాల్లో కల్వకుంట్ల కవితి గురువారం పర్యటించి ప్రజా సమస్యలు అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ... శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని బీఏ నగర్ బస్తీ వాసులు దీపం కిందనే నీడ ఉన్నట్లు ఇక్కడ పేదలు,పేద బస్తీలు ఉన్నాయని అన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫ్రీ కరెంట్ , సబ్సీడి గ్యాస్ మహిళాలకు రూ.2500 లాంటి ఆరు గ్యారంటీలు హామీ అమలు జరగడం లేదని ఆరోపించారు. మున్సిఫల్ అధికారులను బస్తీ వాసులు అడిగితే లీడర్లు చెప్పితే తప్పా పని జరగదనే సమాధానం ఇస్తున్నారని వివరించారు. స్థానికంగా ఉండే స్మశానం నుంచి పాములు ఇండ్లల్లోకి వస్తున్నాయని స్థానికులు ఆవేధన వ్యక్తం చేస్తున్నారని కవిత తెలిపారు.ఇదే నియోజకవర్గంలో 2014లో 64 చెరువులు ఉంటే అనేక చెరువులు కబ్జా అయ్యాయని ఆరోపించారు.మూసాపేటలో యువత పెద్ద ఎత్తున్న పాల్గొని మద్యంమత్తు పదార్థాలకు దూరంగా ఉండాలనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు.యువత మత్తుకు బానిసకాకుండా అవగాహన కార్యక్రమాలు చెపడుతామని కల్వకుంట్ల కవిత అన్నారు. అదేవిధంగా మద్యం, మత్తుకు బానిసైన వారిని విముక్తి కోసం ప్రయత్నాలు చేస్తున్నామని అన్నారు. రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని అత్తాపూర్ డివిజన్‌లోని భూపాల్ నగర్‌లో 45 యేండ్లుగా 25 ఎకరాల స్థలంలో 2వేల కుటుంబాలు జీవనం సాగిస్తున్నారని తెలిపారు. అయితే ఇక్కడి పేదలకు ఆ భూములు రెగ్యూలరైజ్ చేయడంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యంగా వ్యవహారిస్తున్నారని అన్నారు. ఎన్ని ప్రభుత్వాలు మారిన ఇక్కడి సమస్యలు పరిష్కారం కావడం లేదని అన్నారు. ప్రస్తుతమున్న ల్యాండ్‌కు అదనంగా మరోచోట ప్రభుత్వం ఫారెస్ట్ శాఖకు కేటాయించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లా భూ పోరాటం చేసి పట్టాలు ఇప్పిస్తామని జాగృతి తరుపున కవిత హామీ ఇచ్చారు. షాబాద్ మండలంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం ఇవ్వాలని రిలేదీక్షలు చేస్తున్న వాళ్లకు కవిత మద్దతు తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్ కేటాయించే వరకు ఎన్నికలు నిర్వహించొద్దని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో పోరాట చేసిన విధానమే ఇప్పుడు షాబాద్ మండల కేంద్రంలో కనిపిస్తోందన్నారు. ఇదే ధైర్యంతో పోరాడి బీసీల హక్కులను సాధించుకుందామని పిలుపునిచ్చారు. కుల, మతాలకు అతీతంగా పార్టీలల్లోని నాయకులంతా ఐక్యంగా పోరాటం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత క్రమ క్రమంగా రిజర్వేషన్లు ఎత్తివేస్తుందని కవిత ఆరోపించారు.జాగృతి ఇంకా పార్టీగా మారలేదుగానీ నా కమిట్ మెంట్ కొనసాగుతుందన్నారు. నాలుగేళ్ల క్రితం మహిళ బిల్లు కోసం ఢిల్లీలో పోరాటం చేసినప్పుడే బీసీల కోసం పోరాటం చేస్తానని చెప్పానని అన్నారు. అప్పుడు బీఆర్ఎస్ ఎమ్మెల్సీగా ఉన్నాను... ఇప్పుడు ఆ పార్టీలో లేకపోయినప్పటికి పోరాటంలో రాజీ లేదన్నారు. షాద్ నగర్ హస్పిటల్‌లో జరిగిన కొన్ని సంఘటనలు గతంలో విన్నామని కవిత సిబ్బందికి గుర్తు చేశారు. ఈ విషయాలు తెలుసుకునేందుకే ప్రభుత్వ ఆసుపత్రికి విచ్చేసినట్లు వివరించారు. వంద పడుకల కొత్త భవనం పూర్తైనప్పటికి షిఫ్ట్ చేయాలేదు త్వరలోనే చేస్తామని సిబ్బంది తెలిపారు. సిబ్బంది, చికిత్సకు సంబంధించిన విషయాలను క్షుణంగా అడిగి తెలుసుకున్నారు. ఈ ఆసుపత్రిలో 28 మంది స్టాఫ్ నర్సులకు బదులుగా 12 మంది మాత్రమే ఉన్నారని వివరించారు.గైనకాలజిస్టుల డాక్టర్లు ఆరుగురే ఉన్నప్పటికి గత నెలలో 101 డెలవరీలు చేశారని అన్నారు. డాక్టర్లు సిబ్బందిపై ఓత్తిడి లేకుండా పని చేయించుకోవాలని కవిత సూచించారు. అరకోర వసతులతో కూడా వైద్య సేవలందిస్తున్నందుకు కవిత ధన్యవాదాలు తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చే వాళ్లు పేదవాళ్లే కావడంతో ప్రేమతో చూసుకోవాలని వైద్యులను, సిబ్బందిని కవిత కోరారు. ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు సకాలంలో వేతనాలు చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఉమ్మడి మహబూబ్ నగర్ జిల్లాలో ఈ హాస్పిటల్ ఉందని, ఈ జిల్లా వాసి ముఖ్యమంత్రి కావడంతో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని అన్నారు. షాద్ నగర్ నియోజకవర్గం కేశంపేట మండలం తొమ్మిది రేకుల గ్రామంలో ట్రిపుల్ ఆర్ నిర్వాసితులతో తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత సమావేశం అయ్యారు. భూములు కొల్పోతున్న రైతులకు నేను అండగా ఉంటానని కవిత ధైర్యం చెప్పారు. భూమి కొల్పోయే 200 మంది రైతులకు కేవలం ఎకరం, అర ఎకరం విస్తీర్ణం ఉన్నవాళ్లేనని అన్నారు. పెద్దవాళ్ల భూములు కాపాడేందుకు పేదల భూములను లాక్కోవడం సరికాదన్నారు. ఏఏ పెద్దల భూములను రక్షిస్తున్నారో వారి జాబితాను బయటపెట్టి భవిష్యత్తు కార్యచరణ రూపోందిస్తామని భూ నిర్వసితులకు కవిత హామీ ఇచ్చారు. రీజనల్ రింగు రోడ్డు కట్ట పాములా వంకర్లుగా తిరుగుతుందా అని ఎద్దేవ చేశారు. అన్ని దిక్కుల్లో ఒకేవిధామైన పద్దతి ఉండాలని డిమాండ్ చేశారు. నాలుగుసార్లు మార్పులు చేశారంటే ఏదో విషయం దాగుందని కవిత అన్నారు. ఈ ప్రాజెక్టు కేంద్ర ప్రభుత్వ పరిధిలోని అవసరమైతే ప్రధాని మోడిని కలిసి సమస్యలు వివరిస్తామని తెలిపారు. స్థానిక ఎంపీని కూడా కలిసి అడుగుదామని కవిత అన్నారు. రైతులకు అన్యాయం చేసే ఎంతటి వారినైనా నీలదిద్దామని హామీ ఇచ్చారు. ఆడబిడ్డ కళ్లల్లో ఆనందం చూడాలి... గానీ దుఖం చూడటం ఎంత వరకు సబబు అని ప్రభుత్వాలను నిలదీశారు.తెలంగాణ జాగృతి అందరికి అండగా ఉంటుందన్నారు. సమస్య పరిష్కారం కోసం ఎంతవరకైన కోట్లాడుదామని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి ప్రధాన కార్యదర్శి నవీనాచారీ, తెలంగాణ జాగృతి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగారెడ్డి, దుగుంట్ల నరేష్ తదితరులు పాల్గోన్నారు.



### క్షతగాత్రులను పరామర్శించిన

# బి.ఆర్.ఎస్ నాయకులు

- **కుటుంబ సభ్యులకు ఆర్థిక సాయం అందించిన జంగిటి బిక్షపతి**

**చేర్యాల, నవంబర్ 20 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండలం ఆకునూరు గ్రామానికి చెందిన శెట్టే భాస్కర్ కుటుంబ సభ్యులు కొద్ది రోజులు క్రితం గ్యాస్ సిలిండర్ ప్రమాదంలో గాయపడ్డారు..విషయం తెలుసుకున్న మండల బి.ఆర్.ఎస్ నాయకులు జంగిటి బిక్షపతి ఈరోజు సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రి కి వెళ్లి పరామర్శించి, 5000 రూపాయలు ఆర్థికం అందించారు..ఈ సందర్భంగా బిక్షపతి మాట్లాడుతూ మా ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి సేవా స్ఫూర్తి తో నా వంతు గా ఆర్థిక సాయం చేశానని తెలిపారు..మా గ్రామానికి చెందిన శెట్టే భాస్కర్ కుటుంబ సభ్యులు ప్రమాదానికి గురవడం బాధాకరమైన విషయం అని, వారు త్వరగా కోలుకోవాలి అని ఆ దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్టు బిక్షపతి తెలిపారు..కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ యువజన నాయకులు మల్లమారి నవీన్, గోనెపల్లి మహేష్, గ్రామ సోషల్ మీడియా అధ్యక్షులు ముచ్చాల వంశీ తదితరులు పాల్గొన్నారు.




# అమావాస్య అన్నదాన వితరణ కార్యక్రమం

- **అన్ని దానలా కన్నా అన్నదానం మిన్న**

**సిద్దిపేట పవర్ గజ్వెల్ నియోజకవర్గం ప్రతినిధి :**



జగదేవపూర్ మండల కేంద్రంలోని స్థానిక కూరగాయల మార్కెట్ లో జగదేవపూర్ ఆర్యవైశ్య సేవ సమితి సహకారంతో ఆర్యవైశ్య సంఘం మండల అండ్ పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ముఖ్యతిధుగా ఆర్యవైశ్య మహాసభ సిద్దిపేట జిల్లా కార్యదర్శి గజ్వెల్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సముద్రాల హరినాథ్ మండల ఆర్యవైశ్య ప్రెసిడెంట్ గుబ్బ శ్రీనివాసరావు ఆర్య వైశ్య పట్టణ అధ్యక్షులు చిగుళ్లపల్లి వెంకటేశం మండల ఆర్యవైశ్య ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్ మండల ఆర్యవైశ్య కోశాధికారి అయిత బాల్ రాజ్ వారి ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఆర్యవైశ్యులు మాట్లాడుతూ జగదేవపూర్ ఆర్యవైశ్య అన్నప్రసాద సేవ సమితి సహకారంతో ఆర్యవైశ్య సంఘం జగదేవపూర్ అండ్ మండల అమావాస్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం ఆర్యవైశ్యులు సహకారంతో ప్రతి నెల అమావాస్య రోజున అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. అన్ని దానలా కన్నా అన్నదానం మిన్న అని తెలిపారు.అదేవిధంగా అమావాస్య నాడు 300 వందల నుండి 400వందల పేద ప్రజలకు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నారు. ఆర్యవైశ్యులు ప్రతి ఒక్కరి కృషితో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య మండల అండ్ పట్టణ సభ్యులు జూలకంటి కృష్ణమూర్తి జూలకంటి భాస్కర్ బుద్ధ రాములు వల్లలా వెంకటేశం తాటి శంకర్ అయిత బాలరాజు గుట్ట లక్ష్మి నర్సయ్య అయిత నాగరాజు ఆర్యవైశ్యులు తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక

- **విద్యార్థిని కాసారం కీర్తన**

**దుబ్బాక, సిద్దిపేట పవర్ న్యూస్**
**నవంబర్ 20 ప్రతినిధి**

దుబ్బాక మండల పరిధిలోని పెద్ద చీకోడ్ గ్రామంలో పదవ తరగతి చదువుతున్న కాసారం కీర్తన పెద్దచీకోడ్ ఉన్నత పాఠశాల నుంచి ఈ నెల 15న ప్రజ్ఞాపూర్ హై స్కూల్లో నిర్వహించిన ఉమ్మడి మెదక్ జిల్లా స్థాయి ఎస్ జి ఎఫ్ అండర్ 17 నెట్బాల్ ఎంపికలో పాల్గొని తన ప్రతిభను నిరూపించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక అయింది. రాష్ట్ర స్థాయికి ఎంపిక కావడాన్ని గమనించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు బాలరాజు,ఉపాధ్యాయులు ఆమెను అభినందించారు.విద్యార్థిని ప్రతిభను కొనియాడారు.



# యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

**చేర్యాల, నవంబర్ 20 (సిద్దిపేట పవర్)**

చేర్యాల మండలం అర్జున్ పట్ల గ్రామానికి సింగపాక లింగం ఆధ్వర్యంలో మౌలాలి లోని నవోదయ నగర్ కాలనీ లో యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి అని స్థానిక C I భాస్కర్ రెడ్డి, S I విజయ్ ల ద్వారా సమావేశాన్ని ఏర్పాటు చేయించారు..ఈ సందర్భంగా C I, S I లు మాట్లాడుతూ నవోదయ నగర్ లోని యువత మత్తు పదార్థాల కి దూరంగా ఉండాలి అని, అనవసరంగా జీవితాలను నాశనం చేసుకోవద్దు అని వారు సూచించారు..అనంతరం సింగపాక లింగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ట్యూషన్ సెంటర్ ను వారు సందర్శించి లింగంను ప్రశంసించారు..ఈ సందర్భంగా సింగపాక లింగం C I భాస్కర్ రెడ్డి, S I విజయ్ లకు కృతజ్ఞతలు తెలిపారు..



# హైదరాబాద్‌లో లాజిస్టిక్స్ నైపుణ్య శిక్షణ కేంద్రం ప్రారంభం

**సికింద్రాబాద్, నవంబర్ 20 ( సిద్దిపేట పవర్ ):**

భారత సరకు రవాణా రంగం భారీ వృద్ధి దశలోకి ప్రవేశిస్తోందని, దానికి అనుగుణంగా ఆధునిక నైపుణ్య శక్తి అవసరమని కేంద్ర సహాయ మంత్రి జయంత్ చౌధరి తెలిపారు. హైదరాబాద్ ఎన్ఎస్‌టీఐ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన లాజిస్టిక్స్ నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. లాజిస్టిక్స్ సెక్టార్ స్కిల్ కౌన్సిల్ సహకారంతో రెడింగ్టన్ ఫౌండేషన్ ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. చెన్నైలో ప్రారంభమైన కేంద్రం విజయవంతమైన తరువాత హైదరాబాద్‌లో కూడా ఈ ఆధునిక శిక్షణ వ్యవస్థను తీసుకువచ్చారు. ఏఆర్/వీఆర్, సిమ్యులేషన్ ల్యాబులు, పరిశ్రమలకు అనుగుణమైన శిక్షణ ఈ కేంద్రం ప్రత్యేకత. ట్రక్ డ్రైవింగ్, గిడ్డంగి కార్యకలాపాలు, ఫోర్క్‌లిఫ్ట్ ఆపరేషన్, సరఫరా వ్యవస్థ నైపుణ్యాలకు సంబంధించిన శిక్షణ ఇవి అందించనున్నాయి. పరిశ్రమ 4.0, కొత్త సరఫరా వ్యవస్థ సాంకేతికతలను పాఠ్యాంశాల్లో చేర్చినట్లు నిర్వాహకులు తెలిపారు. తెలంగాణ యువతకి ఆధునిక రవాణా రంగంలో ఉద్యోగ అవకాశాలు పెరగడానికి ఈ కేంద్రం తోడ్పడుతుందని రెడింగ్టన్ సస్టెయినబిలిటీ అధికారి ఆర్. వెంకటేష్ చెప్పారు. దేశవ్యాప్తంగా సాంకేతిక ఆధారిత లాజిస్టిక్స్ నైపుణ్యాలను బలపరచడంలో ఈ కేంద్రం కీలక పాత్ర పోషిస్తుందని ఎంఎస్‌డీఈ పేర్కొంది.



### అరుదైన ఆపరేషన్ చేసి బాలుడికి

# పునర్జన్మ ఇచ్చిన గాంధీ వైద్యులు

- **గాంధీలో 7 ఏళ్ల బాలుడికి ల్యాపరోస్కోపిక్ స్ప్లీనెక్టమీ విజయవంతం**
- **కిలో కు పైగా బరువు ఉన్న ప్లీహం తొలగింపు**

**సికింద్రాబాద్, నవంబర్ 20 ( సిద్దిపేట పవర్ ) :**








సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో తొలిసారిగా 7 ఏళ్ల బాలుడికి ల్యాపరోస్కోపిక్ విధానంలో ప్లీహము తొలగించే శస్త్రచికిత్సను వైద్యులు విజయవంతంగా నిర్వహించారు. పీడియాట్రిక్ సర్జరీ విభాగం ప్రొఫెసర్,హెచ్ఓడీ డాక్టర్ నాగార్జున ఆధ్వర్యంలో ఈ శస్త్రచికిత్స జరిగింది. మంచిర్యాల జిల్లా అకినేపల్లి గ్రామానికి చెందిన సూర అఖిల్ అనే బాలుడు పుట్టకతోనే రక్తవ్యాధి హెరిడిటరీ స్ఫిరోసైటోసిస్ తో బాధపడుతున్నాడు. మూడు నెలల వయసు నుంచే వ్యాధి లక్షణాలు కనిపించాయి. ప్లీహము పెరగడం, జాండీస్, తీవ్ర రక్తహీనతతో బాధపడుతూ ప్రతి వారం రక్త మార్పిడి అవసరమయ్యేది. ల్యాపరోస్కోపిక్ స్ప్లీనెక్టమీ చాలా క్లిష్టమైన శస్త్రచికిత్స. రక్తస్రావం ప్రమాదం ఎక్కువగా ఉండడం, ఓపెన్ సర్జరీకి మార్చాల్సిన పరిస్థితులు రావడం, ఖర్చులు అధికం కావడం వంటి కారణాలతో ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా ఇది అరుదుగానే చేస్తారు. పలు ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్ళినప్పటికీ ప్రయోజనం లేకపోవడం, ఖర్చు అధికంగా అవుతుండటంతో తండ్రి రవి గాంధీ ఆసుపత్రికి తన కుమారుడిని తీసుకువచ్చి, అడ్మిట్ చేయించారు. అయితే గాంధీ ఆస్పత్రి వైద్యులు ఈ శస్త్రచికిత్సను పూర్తిగా ఉచితంగా విజయవంతంగా పూర్తి చేశారు.క్లిష్టమైన ఓపెన్ సర్జరీ కాకుండా, ల్యాపరోస్కోపిక్ విధానంలో కడుపుకు నాలుగు చోట్ల రంధ్రాలు చేసి, అందులోనుంచి ప్లీహాన్ని చిన్న,చిన్న ముక్కలుగా చేసి, బయటకు తీశారు. భవిష్యత్ లో ప్లీహం లేని కారణంగా వ్యాధి నిరోధక శక్తి సన్నగిల్లకుండా, వ్యాక్సిన్ లు వేశారు. ఈనెల 6న సర్జరీ విజయవంతంగా చేశారు. శస్త్రచికిత్సలో డాక్టర్ మనోజ్ కుమార్, డాక్టర్ విష్ణు వర్ధన్ రెడ్డి, డాక్టర్ పవన్ రావు,డాక్టర్ అశ్రిత్ రెడ్డి, డాక్టర్ హర్ష, డాక్టర్ సాజిద్ పాల్గొన్నారు. అనస్తీషియా విభాగం నుంచి ప్రొఫెసర్ డాక్టర్ అవుల మురళి, డాక్టర్ బబిత కీలక సహకారం అందించారు.శస్త్రచికిత్స విజయవంతానికి ఆపరేషన్ థియేటర్ సిబ్బంది సిస్టర్ అరుణ, వార్డు సిబ్బంది సిస్టర్ సువర్ణ సహకరించారు. ఆస్పత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వాణి సంబంధిత వైద్యులను అభినందించారు. దాదాపు ప్రైవేట్,కార్పొరేట్ ఆసుపత్రుల్లో దాదాపు రూ.10లక్షలకు పైగా ఖర్చు అయ్యే ఈ సర్జరీని గాంధీ లో ఉచితంగా చేశామని, కోలుకున్న బాలుడు అఖిల్ ను ఈ రోజు డిశ్చార్జ్ చేస్తున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ---.ప్రభుత్వ ఆస్పత్రుల్లో కూడా అత్యాధునిక, క్లిష్టమైన శస్త్రచికిత్సలు చేసేందుకు గాంధీ ఆస్పత్రి పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉంది. పేద, వెనుకబడిన పిల్లలకు కూడా ప్రపంచ స్థాయి చికిత్స అందిస్తున్నాం" అని తెలిపారు. వైద్య రంగానికి సీఎం రేవంత్ రెడ్డి, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ లు ప్రత్యేక చొరవ తీసుకుంటూ, వైద్య రంగం బలోపేతానికి కృషి చేస్తున్నారన్నారు.తమ కుమారుడికి ఒక్క రూపాయి ఖర్చు లేకుండా ఆపరేషన్ చేసి, కాపాడిన గాంధీ డాక్టర్లకు తండ్రి రవి కృతజ్ఞతలు తెలిపారు. డబ్బులు లేని తమలాంటి వారికి గాంధీ ఆసుపత్రి గొప్ప వరమని అన్నారు. కార్యక్రమంలో పీడియాట్రిక్ ప్రొఫెసర్ డా.జార్జ్,ఆర్ఎంవో లు డా.శేషాద్రి, డా.కళ్యాణ చక్రవర్తి,డా.యోగేందర్,సిబ్బంది పాల్గొన్నారు.

# రోడ్ల దుస్థితి గురించి మంత్రిని కలిసిన జేఏసీ నాయకులు

**సిద్దిపేట పవర్ మిరుదొడ్డి నవంబర్20**

సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం అందె గ్రామానికి చెందిన రోడ్ల దుస్థితి గురించి హైదరాబాద్ సచివాలయంలో దుబ్బాక నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి చెరుకు శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో అందె గ్రామానికి సంబంధించిన రోడ్ల దుస్థితి గురించి సిద్దిపేట జిల్లా ఇన్చార్జి మంత్రి గడ్డం వివేక్ ని కలసి ఉండే గ్రామ రోడ్ల పరిస్థితిల గురించి తెలియజేయడం జరిగింది. మారుమూల గ్రామమైన అందే నుండి మిరుదొడ్డి వరకు పంచాయతీరాజ్ రోడ్డు, అందే నుండి తిమ్మాపురం వరకు ఆర్ అండ్ బి రోడ్డు, గత 25 సంవత్సరాల క్రితం వేసిన రోడ్లు, పూర్తిగా కంకర తేలి గుంతల మాయమయ్యాయి. ఈ రోడ్డు పైన వెళ్లే, విద్యార్థులు రైతులు ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతూ నిత్యం నరకం అనుభవిస్తున్నారని, అనేక రోడ్డు ప్రమాదాల గురవుతున్నామని తెలియజేశారు. ఈ గ్రామానికి సంబంధించిన రోడ్లను, HAM ప్రాజెక్టులో ఫేస్ వన్ చేర్చాలని, అందే గ్రామానికి రోడ్లు వేసి ప్రజలకు న్యాయం చేయాలని కోరుతూ తెలపడం జరిగింది. ఈ కార్యక్రమంలో అందే జేఏసీ కన్వీనర్ వారాల రాజకుమార్, అందె ప్రవీణ్, సోమేశ్వర్ రెడ్డి రాజు పరశురాములు శంకర్ నరసింహులు సంతోష్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.



# కక్ష్య సాధింపు చర్యలు మానుకోవాలి

- **జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**చేర్యాల, నవంబర్ 20 (సిద్దిపేట పవర్)**

బి.ఆర్.ఎస్. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పై కక్ష్య సాధింపు చర్యలను మానుకోవాలి అని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి తెలిపారు..ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు, ఎలాంటి అవినీతి జరగని ఫార్ములా ఈ కార్ రేస్ లో విచారణకు ఏసీబీ అనుమతి ఇస్తూ గవర్నర్ అనుమతి తెలపడంతో కాంగ్రెస్ బీజేపీ లు BRS పార్టీ పై కలిసి కుట్రలు చేస్తున్నాయనేది తేటతెల్లామైంది.. BRS ను కట్టడి చేయడానికి KTR ని ఎదుర్కోవడానికి రేవంత్ రెడ్డి, BJP కలిసి పనిచేస్తున్నాయి.. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ప్రజల్లో ప్రభుత్వం పై తీవ్ర వ్యతిరేఖత వచ్చినపుడు, ఎలక్షన్ లు వచ్చినపుడు ఇలాంటి కేసుల అంశాన్ని తెరపైకి తెచ్చి రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నాడు.. ఇప్పుడు మళ్ళీ స్థానిక సంస్థల ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాల నుండి ప్రజల దృష్టిని మరల్చేందుకు కక్ష్యపూరిత రాజకీయాలకు కాంగ్రెస్ తెరలేపింది అని పల్లా రాజేశ్వర్ రెడ్డి ప్రకటనలో తెలిపారు.



# మద్యం సేవించి వాహనాలు నడిపితే కఠిన చర్యలు తప్పవు. మీరుదొడ్డి ఎస్సై సమత.

**సిద్దిపేట పవర్ మిరుదొడ్డి నవంబర్ 20.**

సిద్దిపేట కమిషనర్ విజయ్ కుమార్ ఆదేశానుసారం మిరుదొడ్డి మండల ఎస్సై డ్రంక్ అండ్ డ్రైవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడిన వ్యక్తుల వాహనాలు సీజ్ చేయడంతో పదివేల రూపాయల జరిమానా తో పాటు వారి లైసెన్సులు కూడా రద్దు చేయడం జరుగుతుందని మిరుదొడ్డి ఎస్సై సమత తెలపడం జరిగింది. సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండల వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించడం జరుగుతుందని మిరుదొడ్డి ఎస్ఐ సమత ఈ సందర్భంగా తెలిపారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే భారీ జరిమానా తో పాటు జైలు శిక్ష పడే అవకాశం ఉందని వాహనదారులకు మిరుదొడ్డి ఎస్ఐ సమత సూచించారు. మద్యం సేవించి వాహనం నడిపిన సమయంలో ఇతర వాహనాన్ని మద్యం సేవించిన వ్యక్తి ప్రమాదానికి గురి చేస్తే అతనికి భారీ జరిమానా తో పాటు జైలు శిక్ష కూడా విధించబడుతుందని మిరుదొడ్డి ఎస్ఐ సమత తెలిపారు. డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్ట్ లో భాగంగా లక్ష్మీ నగర్ బస్టాండ్ వద్ద వాహనదారులకు డ్రంక్ అండ్ డ్రైవ్ టెస్టులు చేస్తూ వాహనదారులు ప్రయాణం చేస్తున్న టైంలో మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల మీ ప్రాణాలతో పాటు ఎదుటివారి ప్రాణాలు కూడా పోయే ప్రమాదం ఉందని మద్యం సేవించి వాహనాలను నడపడం చట్ట రిత్య నేరమని తెలిపారు. మద్యం సేవించి పట్టుబడితే ఉపేక్షించేది లేదని మద్యం సేవించిన వ్యక్తుల పైన కఠిన చర్యలు తప్పవని మిరుదొడ్డి ఎస్సై సమత వాహనదారులను హెచ్చరించారు మద్యం సేవించి పట్టుబడిన వారికి భారీ జరిమానా తో పాటు ఆరు నెలల జైలు శిక్ష కూడా విధించబడుతుందని వాహనదారులకు మిరుదొడ్డి ఎస్సై సమత తగు జాగ్రత్తలను సూచించారు







# ధాన్యం విక్రయంలో రైతులకు ఇబ్బందులు కలగద్దు

- **సిద్దిపేట జిల్లా కలెక్టర్ హైమావతి**

**సిద్దిపేట పవర్ నంగునూరు నవంబర్ 20 :**

సిద్దిపేట జిల్లా నంగునూరు మండలంలోని నర్మేట గ్రామంలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ సందర్శించారు. ట్యాబ్ ఎంట్రీ లో జాప్యం కాకుండా చూసుకోవాలని డి ఎం సివిల్ సప్లై ను ఫోన్ ద్వారా ఆదేశించారు. పే మెంట్ వివరాలు ఆరా తీశారు. ఇక్కడ లోడ్ చేసిన వడ్లు ఉమా మహేశ్వర అంక్షాపూర్, శ్రీనివాస్ మిల్ ముంద్రాయి పంపించిస్తు నట్లు సిబ్బంది కలెక్టర్ కి తెలిపారు. వాతావరణ శాఖ సూచనలు పాటించాలని అకాల వర్షాలు కురుస్తాయని రాత్రి సమయంలో రైతులు ధాన్యం పైన టార్పలిన్ కవర్లు కప్పుకోవాలని సూచించారు. తేమశాతం రాగానే వెంటనే గన్నీలలో నింపి లోడ్ అయ్యేలా పని చెయ్యాలని సెంటర్ సిబ్బందిని ఆదేశించారు.





# బాలికలకు మెనూ లోపిస్తే కఠిన చర్యలు తప్పవు

- **ఆకస్మికంగా కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్**

**సిద్దిపేట పవర్ నంగునూరు నవంబర్ 20 :**

నంగునూరు మండలంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాన్ని జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా సందర్శించి మధ్యాహ్న భోజన ప్రక్రియను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అన్నం, పప్పు, కాకరకాయ, సాంబారు, గుడ్డు వండినట్లు వంట సిబ్బంది తెలపగా ఆహార పదార్థాలు తనికి చేసి నాణ్యత మెరుగు పరచాలని పప్పులో ఆకుకూరలు వేసి రుచికరంగా వండాలని వంట సిబ్బందిని ఆదేశించారు. ఎదిగే పిల్లలు కావున పౌష్టికాహారం అందించాలని ప్రతిరోజు విద్యార్థులకు నెయ్యి పెట్టాలని స్వయంగా నెయ్యి వడ్డించారు. విద్యాలయంలో 260 గాను 230 మంది విద్యార్థులు హాజరు ప్రకారం వంట సరుకులు అందించినట్లు ఎస్ఓ కలెక్టర్ కి తెలిపారు. కామన్ డైట్ మెనూ పాటించాలని కూరగాయలు దొరకట్లేదని సాకులు చెప్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. రిజిస్టర్ లు తనికి చేస్తూ రిజిస్టర్ రాయడంలో జాప్యం చేయవద్దని ప్రిన్సిపల్ నుండి వంట సిబ్బంది వరకు మీ యొక్క విధులు సక్రమంగా నిర్వహించాలని విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలకు తరుచు హెల్త్ చెకప్ చెయ్యాలని, హిమోగ్లోబిన్ శాతం చెక్ చెయ్యాలని శాతం తగ్గిన వారికి కొత్త డైట్ లేదా దగ్గరలోని ప్రాంతీయ ఆసుపత్రికి పంపించాలని ఏఎన్ఎం నీ ఆదేశించారు.





# మత్స్యకారులు ఓట్లు వేస్తే నోట్లో మట్టి కొడితివి రేవంత్ రెడ్డి

- **రెండు సంవత్సరాలుగా చేప పిల్లల కోసం మత్స్యకారుల ఎదురుచూపులు**
- **జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ బీఆర్ఎస్ పార్టీ నాయకులు, ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు**

**సిద్దిపేట పవర్ సిద్దిపేట నవంబర్ 20 :**

రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాటలు నమ్మి మత్స్యకారులు ముదిరాజులు ఓట్లు వేస్తే గత రెండు సంవత్సరాలుగా ఉచిత చేప పిల్లలు ఇవ్వకుండా ముదిరాజ్ మత్స్యకారుల బతుకులను ఆగం చేసిండని బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ముదిరాజ్ హక్కుల సాధన సమితి రాష్ట్ర అధ్యక్షులు జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ మండిపడ్డారు గురువారం రోజున సిద్దిపేట ప్రెస్ క్లబ్ లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్, మేడికాయల వెంకటేశం, కీసరి పాపయ్యలు, పడిగే ప్రశాంత్, మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కెసిఆర్ , హరీష్ రావు మత్స్యకారులకు 100% ఉచిత చేప పిల్లలు ఇచ్చి ముదిరాజుల ను ఆదుకున్నారని నేటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారం కోసం కెసిఆర్ ప్రభుత్వాని కంటే గొప్పగా మత్స్యకారులకు చేప పిల్లలు సబ్సిడీ పరికరాలు ఇస్తానని ముదిరాజులను బిసి డి నుండి బిసి ఏ లోకి మారుస్తానని కామారెడ్డిలో నమ్మ పలికి అధికారం చేపట్టినాక మత్స్యకారుల ముదిరాజుల జీవితాలతో ఆటలు ఆడుకుంటున్నాడని అన్నారు రేవంత్ రెడ్డి కేవలం కక్ష సాధింపు కోసమే అధికారం చేపట్టినట్లుగా ఉందని రెండు సంవత్సరాలుగా ముదిరాజ్ మత్స్యకారులకు రావాల్సిన ఉచిత చేప పిల్లలు ఇవ్వకపోవడంతో వారి జీవనం అయోమయంగా మారిందని వారు అన్నారు కామారెడ్డి సభలో ముదిరాజులను బిసి ఏలోకి మారుస్తా అని చెప్పి అసలు ఆ విషయమే మాట్లాడడం లేదని మండిపడ్డారు కక్ష సాధింపులు పక్కనపెట్టి ఇప్పటికైనా ముదిరాజ్ మత్స్యకారుల పైన ముదిరాజ్ జాతి పైన దృష్టి పెట్టి మాకు అందాల్సినటువంటి రిజర్వేషన్ను అదేవిధంగా ఉచిత చేప పిల్లలకు ఇవ్వాల్సిన డబ్బులు నేరుగా మత్స్య సొసైటీలోకి నగదు బదిలీ చేసి సబ్సిడీ పరికరాలను అందించాలని లేకుంటే వచ్చే సర్పంచ్ ఎన్నికలలో ముదిరాజులము నీకు తగిన గుణపాఠం చెప్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు అదేవిదంగా మత్స్యకారులు ప్రమాదవశాత్తు మరణిస్తే ఇన్సూరెన్స్ డబ్బులు ఇవ్వకుండా ఎగనామం పెట్టారని అన్నారు ఇట్టి కార్యక్రమంలో జంగిటి శ్రీనివాస్ ముదిరాజ్ పడిగే ప్రశాంత్ మేడికాయల వెంకటేశం జిల్లెల్ల సుధాకర్ కీసరి పాపయ్య సుతారి రాజు టైగర్ సతీష్ జెట్టి రాజేష్ పెండేలా బాలయ్య యాట రాజేష్ సిద్ధరబోయిన శ్రీనివాస్ కొత్త శంకర్ చెరుకు నారాయణ తదితరులు పాల్గొన్నారు




# త్వరలో ముఖ్యమంత్రి చేతుల మీదుగా ఆయిల్ ఫామ్ ఫ్యాక్టరీ ప్రారంభం

- **అధికారులను ఆదేశించిన జిల్లా కలెక్టర్ హైమావతి**
- **నర్మెట లోని పామాయిల్ ఫ్యాక్టరీని సందర్శించిన కలెక్టర్**

**సిద్దిపేట పవర్ నంగునూరు నవంబర్ 20 :**



నంగునూర్ మండలం లోని నర్మేట గ్రామంలో 300కోట్లతో నిర్మాణం చేస్తున్న ఆయిల్ ఫామ్ ప్యాక్టరీనీ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా త్వరలో ప్రారంభానికి ముందస్తు ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ కె. హైమావతి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్యాక్టరీ లోపల బీటీ రోడ్ నిర్మాణం, డ్రైనేజీ నిర్మాణం వేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులకు తెలిపారు. రోడ్ వెంబడి చెట్ల పొదలు తొలగించాలి. పబ్లిక్ మీటింగ్ కి వివిధ జిల్లాల నుండి ప్రజల సమీకరణ కోసం వాహనాల ఏర్పాటు పార్కింగ్ కోసం పక్కన గల టిజిఐఐసి స్తలం లో చదును చెయ్యాలని, విఐపి పార్కింగ్, హెలిప్యాడ్ తయారి చేయాల్సిందిగా అర్ అండ్ బి అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటనలకు కావలసిన అన్ని అనుమతులు తీసుకుని ప్రారంభానికి సంబంధించిన పనులను పక్కా ప్రణాళికలతో పగడ్బందిగా సిద్ధం చెయ్యాలని ఆయిల్ ఫ్రైడ్ అధికారులను ఆదేశించారు. అందరూ అధికారులు సమన్వయం తో పని చేసి ప్రారంభానికి సిద్ధం చెయ్యాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ సదానందం, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి సువర్ణ, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి స్వరూప రాణి, ఆయిల్ ఫ్రైడ్ మేనేజర్ సుధాకర్ రెడ్డి, ఆయిల్ ఫ్రైడ్ ఇంజనీర్ శ్రీకాంత్ రెడ్డి, ఇతర శాఖల అధికారులు, తదితరులు ఉన్నారు.





# అంధకారంలో జగదేవపూర్ బస్టాండ్

- **మహిళలు ప్రయాణికులు కాలకృత్యాలకు వెళ్లాల్లన్న హోటల్లో వాటర్ ఆడుకొని వెళ్లాల్సిన దౌర్భాగ్యం ఏర్పడింది**
- **మరుగుదొడ్ల ను పట్టించుకొని అధికారులు**
- **పేరుకే మరుగుదొడ్లు ప్రయాణికుల అవస్థలు**

**సిద్దిపేట పవర్ గజ్వేల్ నియోజకవర్గం ప్రతినిధి :**



జగదేవపూర్ మండల కేంద్రంలోని స్థానిక బస్టాండ్ లో అసౌకర్యల వల్ల ప్రయాణికుల ఇబ్బందులు పడుతున్నారని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్బంగా ప్రయాణికులు మాట్లాడుతూ జగదేవపూర్ మండలానికి సిద్దిపేట జిల్లా చివరి భాదర్ అయినందువల్ల చూటుప్రకల్లా మూడు జిల్లా భాదర్ ఇటు యాదాద్రి భువనగిరి వరంగల్ నల్లగొండ రంగారెడ్డి జిల్లాల నుండి నిత్యం ప్రజలు ప్రయాణికులు వస్తూ పోతూ ఉంటారు. మండల కేంద్రంలో స్థానిక బస్టాండ్ రద్దిగా కలకలలు ఆడుతూ ఉంటుంది. స్థానిక బస్టాండ్ లో ప్రయాణికులకు మౌలిక సదుపాయాలు లైట్లు లేక అంధకారంలో బస్టాండ్ త్రాగునీరు మరుగుదొడ్లు లేక హోటల్లో ఆడుకొని త్రాగే మరుగుదొడ్లు వెళ్లే సమయం లో హోటల్లో ఆడుకొని పరిస్థితి ఏర్పడిందని గత ప్రభుత్వం హయాంలో నిర్మాణం పూర్తి చేసిన ప్రారంభనికి నోచుకోని దుస్థితి ఏర్పడిందని కొన్ని సందర్భల్లో ఆకాతాయిలకు బస్టాండ్ వెనక లో అడ్డాగా మారిందని పలు మార్లు పత్రికలల్లో కథనలు వచ్చిన అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆవేదన వ్యక్తం చేశారు.

# మంచిగా చదువుకొని మంచి మార్కులు సాదించాలి..



**సిద్దిపేట పవర్, దుబ్బాక, నవంబర్ 20:**

విద్యార్థులు మంచిగా చదువుకొని మంచి మార్కులు సాదించాలని, మంచి తెచ్చుకోవాలని గుండెల కరుణాకర్ అన్నారు. గురువారం పాఠశాలలో 10వ తరగతి విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లించి మాట్లాడుతూ... విద్యార్థులందరూ మంచిగా చదువుకొని అందరూ 500 పైన మార్కులు తెచ్చుకోవాలని ప్రభుత్వ పాఠశాలలు ప్రైవేట్ పాఠశాలలకు కార్పొరేట్ పాఠశాలకు ఏమి తక్కువ కాదని దీటుగా పోటీ పడాలని, 10వ తరగతతి విద్యార్థుల కు మీ భవిష్యత్తుకు మొదటి అడుగు కాబట్టి మీరందరూ మంచిగా చదువుకోవాలని మీరు ఉన్నంత స్థాయిని అధిరోహించాలని విద్యార్థులతో మాట్లాడారు... గ్రామానికి మీయొక్క తల్లి దండ్రులకు స్కూలుకు ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కరుణాకర్ కోరాడు. తల్లిదండ్రుల కు చిన్న విజ్ఞప్తి ఈ 3 నెలలు మీ పిల్లలకు ఫోన్లు ఇవ్వడం గానీ టీవీలు పెట్టడం వీలైతే మూడు నెలలు టీవీ రీచార్జ్ చేయకండి... పెళ్లిళ్లకు ఫంక్షన్లకు పొలాల కాడికి పొమ్మని పని చెప్పకుండా మీరు కూడా విద్యార్థులతో ఎలా చదువుతున్నారో గమనించాలి తల్లిదండ్రులను కోరడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీ రేణుక మాత ఆలయ కమిటీ చైర్మన్ ఏల్పుల మహేష్, గుండెల బాబు, గంట అజయ్, జాలియం నవీన్, మల్లుగారి ప్రేమ్,గుండెల శ్రీకాంత్, ఆశంగారి కిషన్ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు గాంధీలో ప్రారంభం





- **పుట్టుకతో వినికిడి లోపం ఉన్న చిన్నారులకు వరం.**
- **రూ.పది లక్షల ఆపరేషన్ గాంధీలో ఉచితం...**

**సికింద్రాబాద్, నవంబర్ 20 ( సిద్దిపేట పవర్ ) :**

పుట్టుకతోనే వినికిడి లోపం ఉన్న చిన్నారులకు గాంధీ ఆసుపత్రిలో ఆరోగ్యశ్రీ కింద కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్రచికిత్సలు అందుబాటులోకి వచ్చాయి. చెవిముక్కుగొంతు విభాగం ఆధ్వర్యంలో జీరో నుంచి ఐదేళ్ల వయసు ఉన్న పిల్లలకు ఈ సేవలను అందిస్తున్నారు. ఈమేరకు గాంధీలో తొలిరోజు గురువారం ఈఎన్టీ వైద్య విభాగంలో ఓ బాలుడికి కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీని విజయవంతంగా చేశారు. ఈసందర్భంగా ఈఎన్టీ హెచ్ఓడీ డాక్టర్ భూపేందర్ రాథోడ్ మాట్లాడుతూ...ప్రస్తుతం 40 మంది చిన్నారులకు ఈ శస్త్రచికిత్స అవసరం ఉందని, డిసెంబర్ నాటికల్లా అందరి ఆపరేషన్లు పూర్తి చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. కాక్లియర్ ఇంప్లాంట్ ఆపరేషన్ తో చిన్నారులు వినడంతో పాటు మాట్లాడగలుగుతారని వైద్యులు తెలిపారు. నిరుపేదలకు గాంధీ లో ఈ అవకాశం లభించడం వరం అని అన్నారు. కాక్లియర్ ఇంప్లాంట్ సాధారణంగా రూ.పది లక్షల ఖర్చు అయ్యే శస్త్రచికిత్స అయినా, గాంధీ ఆసుపత్రిలో ఉచితంగా చేయడం రాష్ట్ర ప్రభుత్వ సంకల్పానికి నిదర్శనమని ఆయన పేర్కొన్నారు. గాంధీ ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వాణి మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందించడం గర్వకారణమని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి, హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహా చొరవతో వైద్య రంగంలో తెలంగాణ ముందుకు వెళ్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శేషాద్రి, డాక్టర్ కళ్యాణ్, డాక్టర్ మీనాక్షి, డాక్టర్ రెహాన్ తదితరులు పాల్గొన్నారు.